# క్యాన్సర్ మరణాలను తగ్గించే

# 'హైపెక్' శస్త్రచికిత్స

## దేశంలోనే తొలిసారిగా మియాట్ ఆస్పత్రిలో ప్రారంభం



బ్రిటన్ నుంచి వచ్చిన క్రిస్టీ స్కూల్ ఆఫ్ అంకాలజీ వైద్య బృందంతో మియాట్ ఆసుపత్రి నిర్వాహకులు

**కోడంబాక్కం:** క్యాన్సర్ ఆఖరి దశలో ఉండే బాధితులకు ఇదొక శుభవార్తే. పొత్తికడుపు క్యాన్సర్‌కి గురైన వారి జీవిత కాలాన్ని పెంచే విధంగా దేశంలోనే తొలిసారిగా మియాట్ ఇంటర్నేషనల్ ఆస్పత్రిలో 'హైపెక్' అనే కొత్త శస్త్రచికిత్స విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇండో-బ్రిటిష్ వైద్య భాగస్వామ్యంతో ఈ శస్త్రచికిత్స ద్వారా భారత్‌లో క్యాన్సర్ మరణాలను 25శాతం తగ్గించవచ్చని శుక్రవారం మియాట్‌లో ప్రారంభమైన 'ఐబీహెచ్ఐ' రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ పృథ్వీమోహన్‌దాస్ తెలిపారు. హైపర్‌థెర్మిక్ ఇంట్రా ఆపరేటివ్ పెరిటోనియల్ కీమో థెరపీ (హైపెక్) అనే ఈ శస్త్రచికిత్స 2000 సంవత్సరంలో బ్రిటన్‌లో తొలిసారిగా అందుబాటులోకి వచ్చింది. క్యాన్సర్ బాధితుల జీవిత కాలాన్ని పెంచే ఈ శస్త్రచికిత్సను క్రిస్టీ ఎన్‌హెచ్ఎస్ ఫౌండేషన్ ట్రస్టు వైద్య బృందం ద్వారా మియాట్‌లో అందుబాటులోకి తెస్తున్నారు. దీనిపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో స్థానిక నందంబాక్కంలోని మియాట్ ఆస్పత్రి ఆడిటోరియంలో సదస్సును ఏర్పాట చేశారు. డాక్టర్ పృథ్వీ నేతృత్వం వహిస్తున్న ఈ సదస్సు మియాట్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ డాక్టర్ మోహన్‌దాస్, ఛైర్మన్ మల్లికా మోహన్‌దాస్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. బ్రిటన్‌కు చెందిన హైపెక్ శస్త్రచికిత్స నిపుణుడు, క్రిస్టీస్కూల్ ఆఫ్ ఆంకాలజీ వైద్యుల బృందంతోపాటు సూడాన్, ఇథియోపియా, మస్కట్ తదితర దేశాల వైద్యులు సదస్సుకు హాజరయ్యారు. అతిథులందరినీ సంప్రదాయ రీతిలో పుష్పమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వీ స్వాగతోపన్యాసం చేస్తూ... భారత్-బ్రిటన్ మధ్య చరిత్రాత్మక విద్య, ఆరోగ్యపరమైన సంబంధ బాంధవ్యాలను వివరించారు. రెండు దేశాల ప్రజలకు ఉపయోగపడే విధంగా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. అనంతరం క్రిస్టీ వైద్యురాలు, కొలరెక్టల్ సర్జరీ కన్సల్‌టెంట్ డాక్టర్ సారా ఓడ్వయర్ కీలకోపన్యాసం చేస్తూ... ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లలో క్యాన్సర్ కూడా ఒకటని పేర్కొంటూ, బ్రిటన్‌లో క్యాన్సర్ వ్యాధి ఏ స్థాయిలో ఉంది, దానిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి తెలిపారు. ముఖ్యంగా హైపెక్ శస్త్రచికిత్సలు చేయడానికి అవసరమైన అంతర్జాతీయ నియమ నిబంధనలను వివరించారు. పొత్తికడుపు క్యాన్సర్‌తో బాధపడుతున్న వారిలో పలు ప్రమాణాల ఆధారంగా ఎంపిక చేసిన నిర్దిష్ట వ్యాధిగ్రస్తులకు మాత్రమే హైపెక్ చేయాలన్నారు. కాగా, దేశంలోనే తొలిసారిగా హైపెక్ శస్త్రచికిత్సను శనివారం మియాట్ వైద్య బృందం నిర్వహించనుంది. 50 ఏళ్ల వయసున్న ఓ మహిళకు ఈ శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స సమయం 6 నుంచి 8 గంటల వరకు ఉంటుంది. దీనిని హాట్ కీమో థెరపీ అని కూడా అంటారు. డయాలసిస్ వైద్య పరికరం తరహాలో ఉండే ప్రత్యేకమైన పరికరంతో హైపెక్ శస్త్రచికిత్స చేస్తారు. హైపెక్ వైద్య విధానాలపై వైద్యులతోపాటు చికిత్సలకు అత్యంత కీలకమైన నర్సులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.